క్లుప్తంగా

దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కడప కల్చరల్ : దంత రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్థో దంత వైద్యులు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు పోతుల వెంకట్రామి రెడ్డి, కొండూరు జనార్దన్‌రాజుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాలెంపాపయ్యవీధిలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పైగా దంత పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం సమస్యలు ఉన్న వారిని గుర్తించి చిగుళ్ల వ్యాధి నిపుణులు డాక్టర్ సాయి దివ్య, రూట్ కెనాల్ నిపుణులు డాక్టర్ జ్యోత్స్న, ట్రామా సర్జన్ డాక్టర్ శశికుమార్, డాక్టర్ సందీప్‌లు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఉచితంగా పేస్టులు, మౌత్ వాష్‌లు, మందులు అందజేశారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో సీపీఐ నగర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం తలపెట్టి లబ్ధి పొందాలనే బీజేపీ విధానాలను ఎండగట్టాలన్నారు. కృష్ణ జలాల ఆవశ్యకతపై కడప నగరంలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కలుపుకుని రాష్ట్ర స్థాయిలో సదస్సు ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ. బాదుల్లా, మద్దిలేటి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మెగా వాకథాన్

కడప కల్చరల్/ కడప అర్బన్ : ప్రపంచ ఆర్థరైటీస్ దినోత్సవం పురస్కరించుకుని గురువారం కడప నగరంలో మెగా వాకథాన్ నిర్వహిస్తున్నట్లు విద్యాసాగర్ హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ సి.విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన రాజీవ్ మార్గ్‌లోని తమ ఆస్పత్రిలో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. గురువారం ఉదయం 6.30 గంటలకు తమ ఆస్పత్రి నుంచి వాకథాన్ ప్రారంభమై కలెక్టరేట్ వద్దగల మహావీర్ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

పుస్తకావిష్కరణ



మణికంఠ భగవత్ సంకల్పం అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ సభ్యుడు కల్లూరి బాల యల్లారెడ్డి రచించిన మణికంఠ భగవత్ సంకల్పం అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల మానస సాహిత్య సాంస్కృతిక అకాడమి వారు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో కల్లూరి బాల యల్లారెడ్డికి అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఇందుకుగాను బుధవారం కడప ఆఫీసర్స్ క్లబ్ సమావేశ మందిరంలో క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. కల్లూరి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి ఆయన సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు, పదవీ విరమణ అధికారులు జానమద్ది విజయ్ భాస్కర్, వీరభద్రయ్య, దుబ్బాక విజయరామారావు, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : నేటి యువత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు అన్నారు. ఈ నెల 15వ తేదీ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని రాయల్ కరీం సేవాసమితి ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్‌కలాం ఫొటో పోస్టర్లను ప్రిన్సిపాల్ సూర్యారావు, అధ్యాపకులు విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ అంజద్‌అలీ, షకీలాబేగం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఊరట కలిగించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ బ్యాంకులతో సమానంగా కంప్యూటర్ ఇంక్రిమెంటును ఇవ్వాలని భారతీయ మజ్దూర్ సంఘ్ వైస్‌ప్రెసిడెంట్ వెంగల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ బ్యాంకులతో సమానంగా ఇంక్రిమెంటు ఇచ్చేందుకు జీఓ అనుమతించారన్నారు. అయితే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఇప్పటివరకు స్పందించకుండా కుంటిసాకులు చెబుతుండడం బాధాకరమన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ పేదలకు వరం

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం పేదలకు వరం అని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక అగాడి వీధి, కట్టకింద హరిజనవాడ వద్దనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ 8వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారని, అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్న 50వేలకు పైగా ఖాళీలను భర్తీ చేశారని గుర్తు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 11 రకాల పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. తొలుత డిప్యూటీ సీఎం ‘ఆరోగ్య సురక్ష’ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రతి స్టాల్ ను పరిశీలించి, వైద్యులతో, సిబ్బందితో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు చేశారు. వైద్యులు రోగులను పరీక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆ తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కమాల్‌బాషా, మహమ్మద్ రఫీ, షఫీ, రామ్మోహన్‌రెడ్డి, వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజలకు పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : జగనన్న ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేయడం జరిగిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. బుధవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో భాగంగా 5వ డివిజన్‌లోని అశోక్ నగర్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అశోక్ నగర్‌లో మురికి కాలువల్లో డ్రైనేజీ నీరు సక్రమంగా ప్రవహించక పోవడంపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ లెవెల్స్ తీసి కాలువల్లో నీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్. కవిత అనే మహిళ తనకు జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. ఎస్. క్రిష్ణవేణి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.10 లక్షల వరకూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 5వ డివిజన్ ఇన్‌చార్జి బండి ప్రసాద్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, బండి ఉమ, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, నారాయణమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతూ అపర సంజీవనిలా మారిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. బుధవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కడప నగరానికి చెందిన షేక్ మహమ్మద్ ఇబ్రహీం, పీర్ల నాగేంద్ర, కె. శ్రీదేవి, మడవురి ఎనయ్య, పఠాన్ హజీస్ ఖాన్, జంబవరం ఓబుల్ రెడ్డి, చెన్నూరు భారత్ కుమార్, చెన్నూరు సిద్దమ్మ, షేక్ అఫ్రీన్ బాను అనే 9 మందికి ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి కింద మంజూరైన రూ. 6,52,000 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజాద్ బాష మాట్లాడుతూ.. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ. 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్ జఫ్రుల్లా, 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి, షఫీ, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ పంపిణీ

హరూన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు ఎస్‌బి అహమ్మద్‌బాషా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడప నగరంలోని ప్రభుత్వ మున్సిపల్ ఉర్దూ బాలుర పాఠశాలలో ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా సోదరుడు ఎస్ బి అహమ్మద్ బాషా జన్మదినాన్ని పురస్కరించుకొని ఐఎఫ్‌పి కింద పది గదులకు సౌండ్ సిస్టంను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఎస్.బి. అహమ్మద్ బాషా, 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ రావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉర్దూ బాలుర హైస్కూల్‌కు సౌండ్ సిస్టమ్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

15 నుంచి ఆలయాల్లో దసరా

కడప కల్చరల్ : ఈనెల 15వ తేదీ నుంచి వివిధ దేవాలయాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ భట్టర్ తెలిపారు.

అందులో భాగంగా కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ కోదండరామ అలంకారం, 16న శ్రీ కృష్ణ అలంకారం, శ్రీ రాధాకృష్ణ, 18న శ్రీ రంగనాథ, 19న శ్రీ కాళీయమర్దన అలంకారం నిర్వహించనున్నారు. 20న శ్రీ వెంకటేశ్వర అలంకారం, గరుడ సేవ ఉత్సవం, 21న శ్రీ లక్ష్మీనారాయణ అలంకారం, తోట ఉత్సవం, 22న శ్రీ మోహినీ అలంకారం నిర్వహిస్తామన్నారు. 23న మధ్యాహ్నం 3 గంటలకు శమీదర్శనం, అదేరోజున రాత్రి 9 గంటల నుంచి విజయదశమి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

■ కడప చలమారెడ్డిపల్లె కైలాసపురిలోని శ్రీ దశ మహావిద్య భువనేశ్వరీదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఈనెల 15వ తేది నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ లక్ష్మీకళ తెలిపారు. ఇందులో భాగంగా 15వ తేదీన శ్రీ భువనేశ్వరీదేవి అలంకారం, 16న బాలత్రిపుర సుందరీదేవి, 17న శ్రీ గాయత్రి, 18న అన్నపూర్ణాదేవి, 19న లలిత త్రిపురసుందరీదేవి, 20న సరస్వతిదేవి, 21న శ్రీ మహాలక్ష్మి, 22న శ్రీ దుర్గాదేవి, రాత్రి 10 గంటలకు మహిషాసురమర్దిని అలంకారం నిర్వహిస్తామన్నారు. 23న సాయంత్రం 4.30 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల వ్యక్తిగత స్వార్థం వల్లే రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. బుధవారం కడపలోని మైనార్టీ ఐటీఐలో నగర అధ్యక్షుడు హరి అధ్యక్షతన ఆర్‌ఎస్‌యూ జిల్లా 9వ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ జెండాను ఆవిష్కరించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. విభజన హామీల సాధనకు ఆర్‌ఎస్‌యూ భవిష్యత్తు కార్యచరణ ప్రకటించి ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నాయకులు ప్రమోద్, కళ్యాణ, మహేష్ పాల్గన్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడం తగదు



జ్యోతిరావుపూలే సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు సుబ్రమణ్యం, అన్వేష్ తెలిపారు. ఉపాధి హామీ రక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు బుధవారం నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదికి 200 రోజుల పనిదినాలు 600 కూలి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లి కార్జున, మనోహర్ రెడ్డి, పకీరప్ప, నాగిరెడ్డి, వేముల బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రొద్దుటూరు క్రైం : విజయదశమి సందర్భంగా ప్రొద్దుటూరులో ఆంక్షలు విధించినట్లు ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14 నుంచి పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు చెప్పారు. జమ్మలమడుగు వైపు నుంచి వచ్చే బస్సులు ప్రొద్దుటూరు పట్టణంలోకి రాకుండా పొట్టిపాడు క్రాస్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాలి. మైదుకూరు వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా ఆర్టీసీ బస్టాండు దగ్గర నుంచి రాకపోకలు జరపాలి. రాజుపాళెం వైపు నుంచి బస్సులు ప్రొద్దుటూరు టౌన్‌లోకి రాకుండా కొర్రపాడు రోడ్డులో ఉన్న కాల్వకట్ట, మల్లేలమ్మ ఆలయం వద్ద నుంచి రాకపోకలు కొనసాగించాలి. ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి ఎర్రగుంట్ల బైపాస్ జంక్షన్ (వాసవి సర్కిల్) నుంచి సినీహబ్ మీదుగా ఆర్టీసీ బస్టాండు నుంచి రాకపోకలు సాగించాలి. అలాగే మైదుకూరు వైపు నుంచి కార్లు, బైకుల్లో వచ్చే వ్యక్తులు జిన్నా రోడ్డు మీదుగా వెళ్లి కొవ్వూరు గ్యారేజీలో వాహనాలను పార్కింగ్ చేయాలి. ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చిన వ్యక్తులు తమ వాహనాలను ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వెనుక వైపున ఉన్న స్థలంలో పార్కింగ్ చేయాలి. రాజుపాళెం, జమ్మలమడుగు వైపు నుంచి ప్రజలు తమ వాహనాలను మార్కెట్ యార్డు, ఎగ్జిబిషన్ పార్కింగ్ స్థలంలో నిలపాలి.

– దసరా పండుగ రోజున ప్రత్యేకమైన ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీఐ తెలిపారు.

కానిస్టేబుళ్లకు అభినందన



పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : జిల్లాలోని జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాది కిందట జరిగిన హత్య కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కె. దేవదాస్ , కానిస్టేబుల్ ఎం. సురేష్‌బాబును ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. ఫాస్ట్‌ట్రాక్ కేసుగా పరిగణించిన ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ వుండి తప్పించుకుని తిరుగుతున్న నేపథ్యంలో జమ్మలమడుగు అర్బన్ సీఐ యు. సదాశివయ్య ఆధ్వర్యంలో వీరు ముమ్మరంగా గాలించడంతో ఎట్టకేలకు నిందితుడు పట్టుబడ్డాడు. దీంతో నిందితుడిని ప్రొద్దుటూరులోని సెకండ్ ఏడీజే కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముమ్మందు ఇదే స్ఫూర్తితో విధులను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

లక్ష్యసాధన వరకు విశ్రమించకూడదు



మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి డాక్టర్ ధీరజ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు లక్ష్యసాధన వరకు విశ్రమించకూడదని నందలూరుకి చెందిన ఐపీఎస్ అధికారి డాక్టర్ ధీరజ్‌కుమార్ అన్నారు. బుధవారం కేఎస్‌ఆర్‌ఎంలో కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కెరీర్‌ను ఎలా నిర్దేశించుకోవాలనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉన్నతస్థాయిలో స్థిరపడేందుకు మీరు ఇప్పుడే.. ఇక్కడే వేదికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. తాను వృత్తి రీత్యా వైద్య విద్యను పూర్తి చేసి ప్రజాసేవలో ముందుకెళ్లాలనే కృత నిశ్చయంతో చదివి 2018లో ఐపీఎస్‌కు ఎంపికయ్యానన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్‌మూర్తి, ఏఎం ప్రేమ్‌కుమార్, పోగ్రాం కన్వీనర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవులు ప్రైవేటు ఉపాధ్యాయులకు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దసరా సెలవులు ప్రైవేటు ఉపాధ్యాయులకు కూడా ఇవ్వాలని, స్టడీ క్లాసులు, క్లాస్ వర్క్ ల పేరుతో వారిని స్కూల్ కి రమ్మని చెప్పకుండా సెలవులు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వం 14 నుండి దసరా సెలవులు ప్రకటించిందని కానీ ప్రతి సారి జిల్లా లోని ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు టీచర్లను విద్యా సంస్థలకు రావాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలా జరుగుతోందన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

లింగాల : చిత్రావతి నుంచి ఎర్రబల్లె కొత్తపల్లె చెరువుకు ఏర్పాటు చేస్తున్న భారీ పైపులైను నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ సీఈ హరినారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన భారీ పైపులైను నిర్మాణ పనులను నక్కలపల్లె సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్ద నిర్వహిస్తున్న డ్రైనేజీ ఏర్పాటు పనులను పరిశీలించారు. నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లీకేజీవల్ల చుట్టుప్రక్కల పొలాల్లోకి నీరు లీకేజీ కాకుండా ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ మల్లికార్జునరెడ్డి, ఏఈలు వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రైనేజీలను మంజూరు చేయాలని వినతి

వల్లూరు : మండలంలోని తోల్లగంగనపల్లెలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌కు సర్పంచ్ రాజన్న, వైఎస్ఆర్ సీపీ నేత చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు కడప–తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి తమ గ్రామం వరకు సిమెంట్ రోడ్డును, అలాగే గ్రామంలో డ్రైనేజీ కాలువలను మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డ్రైనేజీ కాలువలను మంజూరు చేస్తానన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా పరిశీలించిన అనంతర అవసరాన్ని బట్టి రోడ్డును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాల అనర్థాలను వివరిస్తున్న కెతుర



కడప ఎడ్యుకేషన్: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా విస్తరణ అధికారి భారతి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో మహిళలు పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ చిన్న వయసు నుంచే బాలికలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా మాస్ మీడియా విస్తరణ అధికారి భారతి అన్నారు. బుధవారం కడప రామాంజనేయపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మాస్ మీడియా విస్తరణ అధికారి రమణయ్య మాట్లాడారు.

బాల్య వివాహాలతో ప్రమాదం

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల వారి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ కెతుర తెలిపారు. బుధవారం కడప నగరంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సఖి ఫౌండేషన్, డేటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి అధ్యక్షతన అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేస్తే అనేక అనర్థాలు తలెత్తుతాయన్నారు. బాలికలను ప్రోత్సహిస్తే వారు దేశం గర్వించే స్థాయికి చేరగలరన్నారు. ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, సఖి ఫౌండేషన్ అధ్యక్షురాలు రహమతున్నిసా మాట్లాడారు. కార్యక్రమంలో డేటాల్ బనేగా స్వస్థ్ ఇండియా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, అమ్మ సేవా సమితి అధ్యక్షుడు శివ శంకర్ పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్ : కర్నాటక రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన నిర్వహించిన జాతీయస్థాయి 13వ బీఆర్‌డీసీఏ ఆన్‌లైన్ చదరంగం టోర్నమెంట్-23లో వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. జిల్లా నుంచి పాల్గొన్న ఖ్యాతిమయి అండర్-11 విభాగంలో 2వ స్థానం, స్పందన అండర్-15 విభాగంలో 5వ స్థానం , లక్ష్మీనోశ్రీ అండర్-9 విభాగంలో రెండవస్థానం, షణ్ముకశ్వి మూడోస్థానం, అండర్-7 విభాగంలో అమీనా 4వ స్థానం, 50 ప్లస్ విభాగంలో అనీస్ దర్బారీ 2వస్థానం సాధించారు. వీరితో పాటు ప్రదీప్ 4.5 పాయింట్లు, ప్రణవ్, గోపీనాథ్ 4 పాయింట్లు, తేజోమయి, గుణవర్ధన్, చరిత్ 3 పాయింట్లు, భద్ర 1 పాయింట్ సాధించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్ : పాతరిమ్స్‌లోని ఆదరణ అనాధాశ్రమంలోని వృద్ధులకు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డిలు బుధవారం సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శంకరయ్య, సుభాన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా పెట్రోలింగ్

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రాజా, ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి రవీంద్రనగర్, పాత లా కాలేజ్, గంగమ్మవీధి, విలాసంబావి వీధిలలో బుధవారం రాత్రి 8 గంటల నుంచి 10గంటల వరకు పెట్రోలింగ్ నిర్వహించారు. గంజాయి సేవించే బ్యాచ్‌కు చెందిన యువత అదే పనిగా మోటార్ సైకిళ్లలో బలాదూర్ తిరుగుతూ వుండటంతో పోలీసు సిబ్బంది కొందరిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు.

మొల్లమ్మకు స్థానం కల్పించాలని వినతి

కడప కల్చరల్ : తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్లమాంబకు ప్రత్యేకస్థానం కల్పించి గౌరవించాలని ఉప కులపతి ప్రొఫెసర్ దేపూరి భారతిని కోరామని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆమెను యూనివర్శిటీ కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించామన్నారు. మొల్ల రామాయణంపై జాతీయ సదస్సు నిర్వహించాలని, ఆమె పేరుతో మొల్ల రామాయణం ప్రచారం కోసం ప్రత్యేకంగా ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని తెలియజేశామన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి, వైవీయూ పాలక మండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించండి

వల్లూరు : త్వరలో వల్లూరు మండలంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా పాల సేకరణ ప్రారంభమవుతుందని, వైఎస్ఆర్ కేపీ అధికారులు, సిబ్బంది దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. వల్లూరు మండల సమాఖ్య కార్యాలయంలో వైఎస్ ఆర్ కేపీ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్యకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించి వివరాలను ఆరా తీశారు. స్త్రీ నిధి లక్ష్యాలను పెంచాలన్నారు. ప్రధానమంత్రి విశ్వ కర్మ పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందింపజేయాలన్నారు. కార్యక్రమలో ఏపీఎం శైలజ, సీసీలు, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు రక్ష



ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష... ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం 1వ వార్డు సచివాలయ పరిధిలోని జ్యోతి బా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. శిబిరంలో ఏర్పాటు చేసిన అన్ని కౌంటర్లు సందర్శించి వైద్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలించి అంగన్‌వాడీ వర్కర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, సతీష్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.